

సైబర్ టెర్రర్!
తిరుపతి నగరంలో ఇటీవల సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వివిధ లింక్‌లను పంపి యథేచ్ఛగా దోచేస్తున్నారు. - 12లో



పక్కా ప్రణాళికతోనే ఏటీఎం చోరీ
ఏటీఎం కస్టోడియన్‌గా పనిచేస్తున్న వ్యక్తి ప్రణాళిక రూపొందించుకుని ఏటీఎంలో చోరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. - 12లో



లారీని ఢీకొన్న ట్రాలీ
నాయుడుపేట మండలం పండ్లూరు వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ట్రాలీ ఢీకొంది. - 12లో

న్యూస్‌రీల్

మధ్యాహ్న భోజనంపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై మంగళవారం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు, ఏజెన్సీలు, వంటవాళ్లు, అక్షయపాత్ర, ఇస్కాన్ ప్రతినిధులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా పాఠశాలలను పర్యవేక్షించాలని సూచించారు. పిల్లలు సంతృప్తి చెందేలా భోజన సౌకర్యాలు ఉండాలని స్పష్టం చేశారు. అలాగే వసతి గృహాల్లోను మెనూ ప్రకారమే భోజనం అందించాలని కోరారు. ప్రతి నెలా పిల్లలకు అందిస్తున్న భోజనం వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే నాణ్యమైన ఫోర్టిఫైడ్ రైస్ అన్ని పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు. పీడీఎఫ్ రైస్‌ను పాఠశాలలకు సరఫరా చేస్తే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై కట్టుదిట్టంగా నిఘా పెట్టాలని డీఈఓ శేఖర్‌కు స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని భోజన నిర్వాహకులు విన్నవించగా, తప్పకుండా సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

తిరుమలలో రద్దీ సాధారణం

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,936 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 18,697 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో తిరుమలేశుని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

కార్మికశాఖ ఉప కమిషనర్‌గా ఓంకార్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: కార్మికశాఖ ఉప కార్మిక కమిషనర్‌గా చిత్తూరు ఏసీఎల్ ఓంకార్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మదనపల్లె ఏసీఎల్ రంగరాజు పాతస్థానానికి వెళ్లడంతో ఓంకార్‌రావును ఉప కమిషనర్‌గా నియమితులయ్యారు.

'సూర్యఘర్'కు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి ఆసక్తిగల గృహ వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ అధికారి దిలీప్‌కుమార్‌రెడ్డితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ కింద గృహ వినియోగదారులు ఇంటిపైనే సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకునేలా సౌకర్యం ఉందన్నారు. ఇందు కోసం పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఈ పథకం అమలుకు కలెక్టర్ చైర్మన్‌గా మరో ఆరుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో జెడ్పీ సీఈఓ, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ., నెడ్‌క్యాప్ జిల్లా అధికారి, మరో ఇద్దరు అధికారులు ఉంటారని వివరించారు. లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని చెప్పారు. ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్‌లకు రూ.60వేలు, మూడు కిలో వాట్‌లు ఆపైన రూ.78 వేల సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. అలాగే 100 కిలోవాట్‌లు పైబడిన ప్రభుత్వ కార్యాలయాల్లో నెడ్ క్యాప్ ఫేజ్–1లోనే విద్యుత్ ప్లాంట్ అమర్చడం జరుగుతుందని వెల్లడించారు. ఈ క్రమంలోనే 5 వేల జనాభా గల ఐదు గ్రామాలను సోలార్ గ్రామాలు తీర్చిదిద్దనున్నట్లు వివరించారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తప్పవు

వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలంలోని 27 గ్రామాల్లో వెలుగు విభాగానికి సంబంధించి నిధుల దుర్వినియోగంపై చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలకు చెందిన వెలుగు కార్యాలయాలపై డీఆర్‌డీఏ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఏడుగురు వెలుగు సభ్యులు రూ.1,05,68,405 దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోందని వెల్లడించారు. ఆ మేరకు వారిపై చర్యలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపినట్లు తెలిపారు. తప్పు చేస్తే ఎవరినీ సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

వసతి.. అధోగతి

కనీస వసతులు లేని భవనాలు.. దుర్వాసన వెదజల్లే మరుగుదొడ్లు.. ఈగలు ముసురుకుంటున్న వంటగదులు.. పట్టపగలే స్వైరవిహారం చేస్తున్న దోమలు.. సక్రమంగా తిరగని ఫ్యాన్లు.. అరకొరగా వెలిగే దీపాలు.. రెక్కలు విరిగిన కిటికీలు.. పేరుకున్న మురుగు పక్కనే తాగునీటి కొళాయిలు.. ఇదీ సర్కారు హాస్టళ్ల దుస్థితి. నిరుపేద విద్యార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. వసతిగృహాల్లోని పిల్లలను అష్టకష్టాలు పెడుతోంది. మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తోంది. నాసి రకమైన భోజనం వడ్డిస్తూ రోగాల బారిన పడేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన మెనూను సైతం పక్కనబెట్టేసింది. చేపట్టిన మరమ్మతు పనులకు కాలదోషం పట్టించింది. దీంతో అధ్వాన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించలేక కొందరు విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. మరికొందరు తప్పని పరిస్థితుల్లో కాలం గడిపేస్తున్నారు.

- దుస్థితిలో సంక్షేమ హాస్టళ్లు
- కనిపించని కనీస సౌకర్యాలు
- ఇప్పటికీ అందని కాస్మొటిక్ చార్జీలు
- దోమల విజృంభణతో జ్వరాల బారిన పడుతున్న విద్యార్థులు
- మరమ్మతులకు నిధులు లేవంటున్న వార్డెన్లు
- వసతిగృహాలను పట్టించుకోని అధికారులు

బాలికల హాస్టల్ గేటు దుస్థితి



గేటు నిలబడాలంటే.. ఈ కర్రను అండగా పెట్టాల్సిందే..





తిరుపతి అర్బన్ : తిరుపతిలోని వసతిగృహాల్లో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దోమల విపరీతంగా వ్యాప్తి చెందడంతో రాత్రిళ్లు నిద్రపోలేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు సాక్షి బృందం బాలాజీకాలనీలోని ఎస్సీ



అపరిశుభ్రంగా హాస్టల్ ప్రాంగణం

హాస్టల్‌ను సందర్శించగా నివ్వెరపోయే పరిస్థితులు దర్శనమిచ్చాయి. పిల్లలు తాగే నీటిలో పురుగులు తేలుతున్నాయి. ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడంతో రోగాల కాసారంగా మారిపోయింది. ఈ క్రమంలో నీళ్ల క్యాన్‌ను విద్యార్థులే కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. అంతేకాకుండా మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో విద్యార్థులు మలమూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళుతున్నారు. చివరకు స్నానాలను కూడా హాస్టల్ భవనం వెలుపలే చేస్తున్నారు. ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది విద్యార్థులు ఉంటున్నారు. అవసరం అయిన మేరకు ఫ్యాన్లు లేకపోవడంతో గాలి రాక దోమలతో తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు కిటికీల అద్దాలు పగిలిపోవడంతో దోమలు యథేచ్ఛగా లోపలికి చొరబడుతున్నట్లు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో కిటికీలకు దుప్పటి కట్టి నెట్టుకొస్తున్నామని తెలియజేస్తున్నారు. మరుగుదొడ్లకు సమీపంలోనే భోజనశాల ఉంది. ఈ క్రమంలో భోజనం చేసే సమయంలో మరుగుదొడ్ల వాసన భరించలేక ఇబ్బందిపడుతున్నారు.

గ్రౌండ్ రిపోర్ట్

నాడు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హాస్టళ్లలోని పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేసింది. ముఖ్యంగా భోజనం విషయంలో వారంలో నాలుగు రోజులు నాన్‌వెజ్‌తోపాటు ఆకుకూరలు,అరటిపండు, గుడ్లు తదితర పౌష్టికాహారం అందించేది. పిల్లలకు కావాల్సిన దుప్పట్లు పంపిణీ చేసింది. హాస్టల్ భవనాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. అంతేకాకుండా పలు భవనాలకు పకడ్బందీగా మరమ్మతు చేయించింది. దీంతో పిల్లలు ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా విద్యాభ్యాసం సాగించేవారు.

నేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ప్రధానంగా మే నుంచి హాస్టల్స్‌కు చెల్లించాల్సిన మెస్ బిల్లులను ప్రభుత్వం నిలిపేసింది. దీంతో మెనూ సంగతి దేముడెరుగు.. పప్పులేని నీళ్ల సాంబారునే విద్యార్థులకు వడ్డించాల్సిన దుస్థితి దాపురించింది. వర్షాల నేపథ్యంలో కనీసం దుప్పట్లను కూడా పంపిణీ చేయలేదు. పిల్లలకు కాస్మొటిక్ చార్జీలు సైతం చెల్లించలేదు. దీంతో సబ్బులు కొనుగోలు చేసుకునేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు.

రేణిగుంట గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర స్కూల్‌కు రెగ్యులర్ ప్రిన్సిపల్ లేరు. దీనికి తోడు పరిసర ప్రాంతాలు అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. పిల్లలకు వడ్డిస్తున్న భోజనం మరింత దారుణంగా ఉంది., చిమిడిపోయిన అన్నం, నీళ్ల సాంబారునే వడ్డిస్తున్నారు. దీంతో 400 విద్యార్థుల్లో 100 మంది టీసీలు తీసుకుని పాఠశాల నుంచి వెళ్లిపోయారు.



హాస్టల్ ప్రవేశద్వారం వద్దే డస్ట్‌బిన్‌లు



తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని హాస్టల్ కిటికీ దుస్థితి

సెలవు మీద విద్యార్థులు

ఇటీవల నాయుడుపేట గురుకుల బాలుర హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కారణంగా 150 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో కలెక్టర్ హుటాహుటిన గురుకులానికి వెళ్లి పిల్లలకు సెలవులు ప్రకటించారు. ఇప్పటికీ 5,6,7 తరగతులకు చెందిన 356 మంది విద్యార్థులు సెలవులోనే కొనసాగుతున్నారు. దీంతో పిల్లల చదువు కుంటుపడుతోందని తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. అలాగే వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి గురుకుల బాలికల పాఠశాలలో తరీనా అనే బాలిక జ్వరంతో బాధపడుతున్నా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదు. బాలిక పరిస్థితి పూర్తిగా విషమించిన తర్వాత తెలియజేశారు. దీంతో బాలిక మృతి చెందింది. ఈ క్రమంలో గురుకుల ప్రిన్సిపల్ శ్రీదేవితోపాటు సునీతా,వాణి అనే ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేసి అధికారులు చేతులుదులిపేసుకున్నారు. శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలనీలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో కోతులు, పాముల బెడద తప్పడంలేదు. వెంకటగిరి బాలికల గురుకుల పాఠశాలలో భోజనం వడ్డించే పని పిల్లలకే అప్పగించారు. 400 మందికి భోజనం వడ్డించేందుకు పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని బీఎన్‌కండ్రిగ ఏకలవ్య గురుకులంలో భోజనం సక్రమంగా లేదని కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం ఇటీవల పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.



పిల్లలకు నీళ్ల సాంబార్ పోస్తున్న దృశ్యం



దుప్పట్లు లేక ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు

అధ్వానంగా భోజనం

గూడూరు నియోజకవర్గంలో మెస్ బిల్లులు మే నుంచి ఇవ్వలేదని విద్యార్థులకు నామమాత్రపు భోజనం వడ్డిస్తున్నారు. తిరుపతి, చంద్రగిరిలోను అవే పరిస్థితులు ఉన్నాయి. తిరుపతి చెన్నారెడ్డికాలనీలోని సాంఘిక సంక్షేమ కళాశాల హాస్టల్‌కు నీటి సమస్యలు తప్పడంలేదు. రోజు రెండు ట్యాంక్‌ల నీటిని మాత్రమే కార్పొరేషన్ వారు అందిస్తున్నారు. అదే ప్రాంతంలో సాంఘిక సంక్షేమ స్కూల్ హాస్టల్–2లో కిటికీలకు ఏర్పాటు చేసిన మెష్ దెబ్బతినడంతో దోమల బెడద విపరీతంగా ఉంది. అదే ప్రాంతంలో బీసీ బాలుర హాస్టల్‌లోని వాటర్ ట్యాంక్ అధ్వానంగా ఉంది. వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని హాస్టల్స్‌లోను మెస్ బిల్లులు అందకపోవడంతో పిల్లలు నీళ్ల సాంబారుతో సర్దుకోవాల్సి వస్తోంది. సత్యవేడు, శ్రీకాళహస్తి హాస్టల్స్‌లోను నామమాత్రపు భోజనాలతోనే నెట్టుకొస్తున్నారు.



నాయుడుపేట గురుకుల హాస్టల్‌లో కింద కూర్చుని భోజనం చేస్తున్న పిల్లలు



తాగునీటి కొళాయిల వద్ద నిల్వ చేరిన మురుగు



అధ్వానంగా టాయ్‌లెట్

ఒకే గదిలో 20 మంది



హాస్టల్లోని ఒకే గదిలో సుమారు 20 మంది వరకు ఉంటున్నాం. ఇంతమందికీ ఒకే ఫ్యాన్ ఉంది. గాలి కూడా రాని పరిస్థితి. గదికి ఉన్న కిటికీలు సైతం సక్రమంగా లేకపోవడంతో దోమల బారిన పడుతున్నాం. హాస్టల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. కనీస వసతులు లేవు. తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. మరుగుదొడ్లలో కాళ్లు మునిగిపోయేలా నీరు నిలిచింది. దీంతో ఆరుబయట ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి తలెత్తుతోంది.

– రోహిత్, డిగ్రీ విద్యార్థి(సీకామ్), కుప్పం

కలుషిత నీరే దిక్కు



హాస్టల్లోని విద్యార్థులందరం కలుషిత నీటినే తాగుతున్నాం. కొందరు మాత్రమే బయటకు వెళ్లి వాటర్ బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. భోజనంలో నాణ్యత లేదు. తాగు నీరు లేదు. ప్లేట్లు కడుక్కునే నీటినే తాగుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. సాంబారు, చట్నీలు నాసిరకంగా ఉంటున్నాయి. సరిపడా సాంబారు వేయడం లేదు. రెండు గరిటెలు సాంబారు వేస్తున్నారు. అంతే మళ్లీ వేయరు. దీంతో మిగిలిన అన్నం తినలేక కొంతవరకు పడేస్తున్నాం.

– జ్ఞానేంద్ర, పుంగనూరు

కూరల్లో నాణ్యత లేదు



మాకు పెట్టే భోజనంలో పూర్తిగా నాణ్యత లేదు. సరిపడేంత సాంబారు, కూరలు వేయరు. ప్రశ్నించినా ప్రయోజనం లేదు. కేవలం రెండే గరిటెలు సాంబారు పోస్తున్నారు. దాంతో చాలకపోయినా చేసేది ఏమీలేక ఏదో ఒక్కటి అంటూ సర్దుకుపోతున్నాం. తాగునీటి వసతి లేదు. దోమలు విపరీతంగా ఉన్నాయి. తరచూ జ్వరాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి.

– గణేష్, రాయచోటి, కొండపొరిపల్లె



చెట్లపొదిని తలపిస్తున్న బీసీ బాలిక హాస్టల్ ప్రాంగణం



కిటికీకి దుప్పటి అడ్డుపెట్టుకుని దోమల బెడద తప్పించుకునేందుకు యత్నిస్తున్న విద్యార్థులు

విజయవంతంగా వైద్య విద్యాసదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా : తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో మంగళవారం ఐపీసీ, జాతీయ ఫార్మాకో విజిలెన్స్ ఆదేశాల మేరకు ఔషధాల వాడకంతో తలెత్తే దుష్ప్రభావాలపై నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు హాజరయ్యారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ రోగులు మందులను ఇష్టానుసారం వినియోగించకూడదన్నారు. వైద్యుల సూచన మేరకే వాడాలని కోరారు. రుయా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఔషధాలు వాటి వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఔషధ విభాగాధిపతి డాక్టర్ ఆశాలత మాట్లాడుతూ ప్రతికూల ఔషధాల ప్రతి చర్యలను విశదీకరించారు. డాక్టర్ యు.భారతి , డాక్టర్ జి.సురేంద్ర కుమార్ మాట్లాడుతూ రోగి భద్రతలో మందుల ప్రాముఖ్యతను తెలిపారు. ఈ సందర్భంగా వైద్య, పారామెడికల్ విద్యార్థులకు, క్విజ్, టెస్టులు నిర్వహించారు. అనంతరం ఫార్మసీ విద్యార్థు లకు సర్టిఫికెట్లు, ఫ్యాకల్టీలకు జ్ఞాపికలు అందజేశారు.

రుయాలో బాలుడికి అరుదైన శస్త్రచికిత్స

తిరుపతి తుడా: చిత్తూరు జిల్లాకు చెందిన ఓ పదిహేనేళ్ల బాలుడికి తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. రెండు కాళ్లకు పక్షవాతం వచ్చి బాధపడుతున్న బాలుడు రెండు నెలల క్రితం రుయాలో చేరాడు. వైద్య పరీక్షల అనంతరం ఇది వెన్నుపాము టెరాటోమా (అరుదైన కణితి) కేసుగా వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు న్యూరోసర్జన్లు, మత్తు వైద్యుల బృందం విజయవంతంగా బాలుడికి ఆపరేషన్ నిర్వహించి కణితిని తొలగించారు. ఆపరేషన్, ఫిజియోథెరపీ తర్వాత బాలుడు ఎటువంటి సమస్యలు లేకుండా సాధారణంగా నడవగలుగుతున్నాడు. కోలుకున్న బాలుడిని మంగళవారం డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు. అద్భుతమైన అరుదైన ఆపరేషన్ నిర్వహించిన న్యూరో సర్జన్లు డాక్టర్ నాగరాజా, డాక్టర్ అనంత కిరణ్, డాక్టర్ సుదర్శన్ అగర్వాల్, మత్తుమందు వైద్య బృందానికి రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ అభినందనలు తెలియజేశారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సూపర్ స్పెషాలిటీ వైద్యం, నిపుణుల సేవలను పేద కుటుంబాలు వినియోగించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

11న అప్రెంటీస్ షిప్ మేళా

తిరుపతి అర్బన్: ఈ నెల 11న ఉదయం 10 గంటలకు తిరుపతిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నామని, దీనిని ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలో పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో శిక్షణ నిమిత్తం ఈ మేళా ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. ప్రధానమంత్రి ఇచ్చిన స్కిల్ ఇండియా–మేకిన్ ఇండియా పిలుపు మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు అప్రెంటీస్ అడ్వైజర్ గంగాధర్‌ను 9441647174, 9533717170 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

13 నుంచి శ్రీకాళహస్తిలో పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి రూరల్ : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో భక్తుల వల్ల కానీ, సిబ్బంది వల్ల కాని ఏదైనా తెలియని అపచారం జరిగి ఉంటే వాటిని పరిహారంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన భగత్ పూజారి

చంద్రగిరి: ప్రమాదవశాత్తు ట్రాక్టరు బోల్తా పడి ఒడిశాకు చెందిన వలస కార్మికుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ముంగిళిపట్టు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఐతేపల్లి అయ్యప్ప స్వామివారి ఆలయ సమీపంలోని ఓ సిమెంట్ బ్రిక్స్ వద్ద ఒడిశాకు చెందిన భగత్ పూజారి(28) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం కూలీలతో కలసి సిమెంటు బ్రిక్స్ లోడుతో ట్రాక్టర్‌ను తీసుకుని భగత్ పూజారి ముంగిళిపట్టు జగనన్న కాలనీకి బయల్దేరాడు. కాలనీ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న భగత్ పూజారి ట్రాక్టర్ ఇంజిన్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదానికి గల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. దీనిపై ఎస్ఐ అనితను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. అయితే ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ కేవలం వ్యవసాయానికి సంబంధించి మాత్రమే వినియోగించాల్సి ఉందని స్థానికులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాల లావాదేవీలకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారని, ట్రాక్టర్‌కు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో, ఘటన స్థలం నుంచి ట్రాక్టర్‌ను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సైబర్ టెర్రర్!

- నరికొత్త పంథాలో రెచ్చిపోతున్న నేరగాళ్లు
- చిక్కితే బ్యాంక్ ఖాతా ఖాళీ
- అప్రమత్తత ఎంతో అవసరం

- తిరుచానూరు పరిధిలో నివాసముంటున్న ఓ వ్యక్తికి జాబు ఇప్పిస్తామని రెండు నెలల క్రితం లింకు వచ్చింది. ఆ లింకు ఓపెన్ చేయగానే వంద రూపాయలు పే చేస్తే 200 రూపాయలు వచ్చింది. మళ్లీ అదనంగా పే చేశాడు. అలా మూడు ఛాన్సులు అయిపోయాక.. 10 వేల రూపాయలు చేసుకుంటే.. నీకు ఒకేసారి అమౌంట్ వస్తుంది అని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. ఇలా ఆ వ్యక్తి రూ.5,85,000 ఇన్వెస్ట్‌మెంట్ చేశాడు. ఆ తర్వాత అంత డబ్బు రాకపోవడంతో.. మోసపోయామని తెలుసుకుని స్థానిక పోలీసులను సంప్రదించాడు.
- మూడు రోజుల క్రితం అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న ఒక వ్యక్తికి నార్కోటిక్ నుంచి కాల్ చేస్తున్నామని కొందరు వ్యక్తులు ఫోన్ చేసి నమ్మించారు. ఎయిర్‌పోర్ట్‌లో మీకోసం పార్సిల్ వచ్చిందని, ఆ పార్సిల్లో డ్రగ్స్ ఉన్నాయని భయపెట్టించారు. కేసులు వద్దనుకుంటే కొంత మొత్తం తమకు నగదు ఇవ్వాలని కోరారు. దీంతో ఆ వ్యక్తి భయభ్రాంతులకు గురై రూ.1,50,000ను వారు సూచించిన అకౌంట్‌కు వేశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తులు ఫోన్ స్విచ్చాఫ్ చేసేసరికి..మోసపోయామని పోలీసులను ఆశ్రయించాడు.
- గత జూలైలో తిరుపతి నగరంలో ఉన్న ఓ వ్యక్తికి కాల్ చేసి మీ కొడుకు నార్కోటిక్ కేసులో దొరికిపోయాడని నమ్మబలుకుతారు. వీడియో కాల్ చేసి వారు నార్కోటిక్ పోలీసులు నమ్మించారు. ఆపై వారి వద్ద నుంచి రూ.4,50,000ను కాజేశారు. కొంతసేపటికి తన కుమారుడికి ఫోన్ చేయగా.. అలాంటిదేమీ లేదని చెప్పడంతో మోసపోయామని తెలుసుకుని బోరున విలపించారు.

జిల్లాలో నమోదైన కేసులు

సంవత్సరం	నమోదైన కేసులు	మోసపోయిన సొమ్ము రూ	రికవరీ
2022	172	1,50,72,000	94,18,816
2023	166	2,73,86,000	93,78,000
2024 ఇప్పటివరకు	161	3,80,09,000	1,86,80,000

ఫిర్యాదు చేసేందుకు: సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఫోన్ నంబర్- 1930 | వెబ్‌సైట్: సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్

తిరుపతి పరిధిలో నమోదైన కేసులలో 45 కోర్టు ఆర్డర్ ద్వారా నేరుగా ఫ్రాడ్ అకౌంట్‌లో నుంచి బాధితులకు బదిలీ చేసేలా మేనేజర్లకు ఆర్డర్లు జారీచేశారు. ఇదిలా ఉంటే 45 కోర్ట్ ఆర్డర్లు రావడం ఆంధ్రప్రదేశ్‌లోనే తిరుపతి ప్రథమ స్థానంలో ఉండదం గమనార్హం.



తిరుపతి క్రైమ్: నగరంలో ఇటీవల సైబర్ నేరగాళ్ల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. పోలీసులు, దర్యాప్తు సంస్థల అధికారులమని బెదిరింపులకు దిగుతున్నారు. ఈకేవైసీల పేరిట లింక్‌లు పంపి, క్రిప్టో కరెన్సీ, వలపు వలలు విసిరి మోసాలకు పాల్పడుతున్నారు. ఎనిమిది నెలల వ్యవధిలో జిల్లాలో 50కిపైగా సైబర్ కేసులు నమోదయ్యాయంటే నేరగాళ్ల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి అడ్డుకట్ట పడాలంటే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎవరైనా మోసపోతే వెంటనే పోర్టల్లో ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

మోసాలు ఇలా..ఏమారితే ఎలా?

- ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ మంది ఆన్‌లైన్లో ఉన్న వివిధ వివాహ వెబ్‌సైట్లలో ఫొటోలతో సహా తమ బయోడేటా నమోదు చేసుకుంటున్నారు. ఆ వివరాల ద్వారా ఫోన్ లేదా ఈ–మెయిల్‌లో సంప్రదించి బురిడీ కొట్టిస్తున్నారు. అవతలి వైపు నుంచి నమ్మకం పొందాక తమ ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఏదో ఒక అవసరం ఉందని చెప్పి అందినకాడికి దోచేస్తున్నారు.
- సాంకేతికత అభివృద్ధి నేపథ్యంలో ప్రతిదీ డిజిటల్ అయ్యింది. బయటికి వెళ్లకుండా వస్తువులు, ఆహారం తెప్పించుకుని తింటున్న పరిస్థితులు వచ్చాయి. ఎక్కువమంది ఆన్‌లైన్ షాపింగ్ పైనే ఆధారపడుతున్నాడు. క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్ ఉన్నా డిస్కౌంట్ మరేదైనా ఆఫర్ల కోసం క్రెడిట్, సివిల్ కార్డుల ద్వారానే నగదు చెల్లిస్తున్నారు. దీన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.
- మేము ముంబైలోని కొరియర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేస్తారు. మీ పేరుతో విదేశాల నుంచి పార్సిల్ వచ్చింది.. అందులో డ్రగ్స్ ఉన్నాయని భయపెడుతారు. డ్రగ్స్‌తో మీకు సంబంధం ఉంది.. ఇది తీవ్రమైన నేరం అంటూ హడలెత్తిస్తారు. వీడియో కాల్‌చేసి విచారణ పేరిట హడావుడి చేస్తారు. దీని నుంచి బయటపడాలంటే తాము చెప్పినంత మొత్తం చెల్లించాలని, లేకపోతే అరెస్ట్ తప్పదని కంగారు పెడతారు. ఇదంతా నిజమేనని నమ్మి వారు అడిగినంత సొమ్ము బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేస్తూ అనేకమంది మోసపోతున్నారు.
- వాట్సాప్ కాల్స్ ద్వారా అసభ్యకరంగా మాట్లాడుతూ ఆపై వీడియోలు తీసి బెదిరిస్తున్న సైబర్ నేరగాళ్ల పెరిగారు. యువకులు, ఉద్యోగులే లక్ష్యంగా రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ ముఠాలు వలపువల విసురుతున్నాయి. బుట్టలో పడినవారిని బెదిరించి నగదు దోచేస్తున్నారు.
- క్రిప్టో కరెన్సీ, బ్లాక్ ట్రేడింగ్లో పెట్టుబడులు పెట్టండి.. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో కళ్లు చెదిరే ఆదాయం పొందండి.. అంటూ సంబంధిత వాట్సాప్ గ్రూప్ నుంచి మీ నంబర్‌కు కాల్ చేస్తారు. వాటివైపు ఆకర్షించి.. భారీగా పెట్టుబడులు పెట్టిస్తారు. తీరా అందినకాడికి దోచుకుని చేతులెత్తేస్తారు.
- ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్ ద్వారా చాలా మంది మోసాలకు పాల్పడుతున్నారు. ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో నగదును తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఏఈపీఎస్ పద్ధతిని ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఫింగర్ ప్రింట్ సాయంతో రోజుకు రూ.10 వేల వరకు డ్రా చేసుకోవచ్చు. ఇదే అదునుగా సైబర్ నేరగాళ్ల పలు రూపాల్లో ప్రజల వేలిముద్రలను సేకరించి డబ్బు దోచేస్తున్నారు.

ఈ సమయంలో ఫిర్యాదు చేస్తే మంచిది

ఎవరైనా ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలుచేస్తే సంబంధిత కొనుగోలుదారులకు బ్యాంకు ఖాతా నుంచి డబ్బు ఈ–కామర్స్ వెబ్‌సైట్ నిర్వాహకులకు చేరేందుకు రెండు రోజులు పడుతుంది. సైబర్ నేర దర్యాప్తులో ఈ సమయాన్ని గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే పోలీసులు లావాదేవీలను నిలిపేందుకు కృషి చేస్తారు.

అప్రమత్తంగా ఉండాలి



నేరగాళ్లకు చిక్కకుండా జాగ్రత్త పడాలి. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తుల మెసేజ్‌కు స్పందించొద్దు. బ్యాంకుల పేరుతో వచ్చే కాల్స్‌కు ఓటీపీలు చెప్పరాదు. అనవసర యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దు. కస్టమ్స్, సీబీఐ, ఈడీ నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా చెబితే కచ్చితంగా అనుమానించాలి. సైబర్ మోసాలకు గురైతే సమీప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– సుబ్బరాయుడు, తిరుపతి జిల్లా ఎస్పీ

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

తిరుపతి లీగల్ : భర్తను హత్య చేసిన భార్యకు జీవితఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన మంగళవారం తీర్పు నిచ్చారు. వివరాలు.. శ్రీ భాష్యం వసుంధర తన భర్త ఎస్.రవిచంద్రతో కలిసి ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి వ్యాపారరీత్యా రేణిగుంటకు వచ్చింది. వారికి మానసిక వైకల్యంతో బాధపడుతున్న కుమారుడు ఉన్నాడు. రవిచంద్ర అప్పటికే కొన్ని వ్యాపారాలు చేసి నష్టపోయాడు. పలువురు మహిళలతో వివాహేతర సంబధాలు సాగిస్తూ ఇంట్లో భార్యను వేధించేవాడు. కుటుంబ అవసరాలు పట్టించుకోకుండా నిత్యం వేధిస్తూ ఉండడంతో తట్టుకోలేకపోయిన వసుంధర కత్తితో రవిచంద్రను పొడిచి హత్య చేసింది. అనంతరం తల నరికి సంచిలో వేసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. ఈ క్రమంలో కేసు విచారించిన కోర్టు ఆమె చేసిన నేరం రుజువు కావడంతో శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ విజయలక్ష్మి వాదించారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తిరుచానూరు(చంద్రగిరి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తెల్లపంచె, బనియన్ వేసుకుని సుమారు 60 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వృద్ధుడు రోడ్డు దాటుతున్న క్రమంలో తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అనంతరం వెనుకనే మరో రెండు వాహనాలు మృతదేహంపై వెళ్లడంతో గుర్తు పట్టలేనంతగా తయారైంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సాయినాథ్ తెలిపారు.

కొడుకు మందలించాడనే..



సీతారామప్పతో వెస్ట్ సీఐ రామకష్ణ

తిరుపతి తుడా : తిరుపతి స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదృశ్యమైన రోగిని ఎట్టకేలకు కనిపెట్టారు. ఈ మేరకు వెస్ట్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలోని బృందం మంగళవారం రుయాలోని ఎంఎం వార్డులో రోగి సీతారామప్ప చికిత్సపొందుతున్నట్లు గుర్తించారు. వివరాలు.. రామసముద్రం మండలం బొరవమాకులపల్లెకు చెందిన సీతారామప్ప (68) అనారోగ్యం బారిన పడడంతో కుటుంబీకులు ఆగస్టు 27వ తేదీన స్విమ్స్‌లో చేర్పించారు. 28వ తేదీన ఎవరికీ చెప్పకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. అయితే కుటుంబ సభ్యులు మాత్రం ఆస్పత్రి యాజమాన్యంపై ఆరోపణలు చేశారు.. అధికారులు నర్సులు సెక్యూరిటీ నిర్లక్ష్యం వల్లే సీతారామప్ప వెళ్లిపోయాడంటూ గందరగోళం సృష్టించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, టీడీపీ నేత పరసారత్నంతో కలిసి ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి రోగిని పట్టుకునేందుకు మూడు బృందాలుగా ఏర్పడి వారం రోజులపాటు పలు ప్రాంతాల్లో గాలించారు. తీరా ఆయన రుయా ఆస్పత్రిలోని ఎంఎం వార్డులో చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. తన కొడుకు విశ్వనాథ్ మందలించడంతోనే మనస్తాపానికి గురై ఎవరికి చెప్పకుండా స్విమ్స్ నుంచి వచ్చేసినట్లు ఆయన పోలీసులకు తెలిపారు. వారం రోజులుగా సాగిన హైడ్రామాకు తెరపడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

లారీని ఢీకొన్న ట్రాలీ



కేబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

నాయుడుపేటటౌన్ : మండలంలోని పండ్లూరు వద్ద జాతీయ రహదారి పక్కన ఆగిఉన్న లారీని మంగళవారం వేకువజామున భారీ మిషనరీ లోడ్‌తో వెళుతున్న ట్రాలీ ఢీకొంది. దీంతో ట్రాలీ లారీ డ్రైవర్ సద్దాం హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డారు. కేబిన్‌లో కాళ్లు ఇరుక్కుపోవడంతో నరక యాతన అనుభవించాడు. పోలీసులు, హైవే అంబులెన్స్ సిబ్బంది ఆధ్వర్యంలో క్రేన్‌సాయంతో డ్రైవర్‌ను వెలికి తీశారు. వివరాలు.. బెంగుళూరు నుంచి భారీ మిషనరీ లోడు చేసుకుని జార్ఖండ్‌కు ట్రాలీ లారీ వెళుతోంది. భారీ వర్షం కురుస్తుండడంతో రోడ్డు పక్కన నిలిపిన లారీ కనిపించక ఢీకొంది. సీఐ బాబీ పోలీసులతో ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కా ప్రణాళికతోనే ఏటీఎం చోరీ

- కస్టోడియనే ప్రధాన సూత్రధారి
- ఇద్దరు నిందితుల అరెస్ట్.. మరొకరు పరార్
- రూ.6.56లక్షల సొత్తు స్వాధీనం
- ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : జిల్లాలో సంచలనం రేపిన ఏటీఎం చోరీ కేసును చంద్రగిరి పోలీసులు ఛేదించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆగస్ట్ 30వ తేదీ రాత్రి సమయంలో కోసూరి కాంప్లెక్స్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో చోరీ జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గాదంకి టోల్‌గేట్ సమీపంలో ఉన్న రాధే హోటల్ ముందు నిందితులైన ఏటీఎం కస్టో ఉద్యోగి కొంగర్ల సురేష్ బాబు, వైఎస్సార్ జిల్లాకు చెందిన జేసీబీ ఆపరేటర్ చదర్ల మనోజ్ కుమార్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు. వీరిని విచారించగా ఆసక్తికరమైన విషయాలు బయటపడినట్లు వివరించారు. ఆయన మాటల్లోనే.. కస్టోడియన్‌గా పని చేస్తున్న సురేష్ బాబు కొంతకాలంగా కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఏటీఎంలో నగదు నింపే సమయంలో వ్యాన్ డ్రైవర్ మనోజ్ కుమార్‌తో కలిసి కొంత క్యాష్ అపహరించేవాడు. ఇటీవల సదరు వ్యాన్ డ్రైవర్ తన ఉద్యోగం వదిలేశాడు.

- బ్యాంకు ఆడిట్ జరుగుతుందని తెలియడంతో తన మోసం ఎక్కడ బయటపడుతుందో అని చందర్ల మనోజ్ కుమార్‌తో కలిసి ఏటీఎం చోరీకి కుట్రపన్నాడు.
- ఈ మేరకు ఆగస్ట్ 23వ తేదీ నగదు నింపే సమయంలో ఏటీఎంకు తాళం వేయకుండా, డోరు మాత్రమే మూసివచ్చేశాడు.
- అనంతరం 30వ తేదీ అర్ధరాత్రి సురేష్ మనోజ్ కుమార్ కలిసి కార్ లో చంద్రగిరికి చేరుకున్నారు.
- సురేష్ కొంత దూరంలో ఉండగా, మనోజ్ కుమార్ అనుకున్న ప్రకారం సెక్యూరిటీ డ్రెస్ వేసుకొని మాస్క్,, చేతులకు గ్లౌజులు ధరించి ఏటీఎం గదిలోకి ప్రవేశించాడు.
- డోరు తెరిచి అందులో ఉన్న నగదు మొత్తం రూ.2,53,500 దోచేశాడు. అనంతరం ఏటీఎంలో మొత్తం రూ.39,53,500 దొంగలించినట్లుగా చిత్రీకరించాడు.
- దీనిపై సురేష్‌ను విచారించగా ఏటీఎంలో ఇన్నాళ్లుగా దోచేసిన నగదులో కొంత జూదం, ఇతర వ్యసనాలకు ఖర్చుపెట్టినట్లు అంగీకరించాడు.
- రూ.8 లక్షలు క్యాష్ వాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న బుడ్డల మనోజ్ కుమార్ వద్ద ఉన్నట్లు వెల్లడించాడు. అయితే అతను పరారీలో ఉన్నాడు.
- పట్టుబడిన నిందితుల నుంచి రూ.5.38లక్షల నగదు, మారుతి ఆల్టో కారు, ఎల్‌జీ రిఫ్రిజిరేటర్, రెండు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం మొత్తం రూ.6.59లక్షల సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం

సెంటర్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఎస్పీ తెలిపారు. బ్యాంకు ఏటీఎంలో నగదు ఎంత పెడుతున్నారు. ? ఎంత లావాదేవీలు జరుగుతున్నాయి.. ? అనే విషయం కూడా బ్యాంకు వారికి అర్థం కావడం లేదని చెప్పారు. ఇందులో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తోందన్నారు. త్వరలోనే బ్యాంక్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి భద్రతా చర్యలపై సూచనలు చేయనున్నట్లు వెల్లడివంచారు.

డ్రగ్స్ రహితంగా జిల్లా

జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఈ మేరకు ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్‌ను ఏఎస్పీలు వెంకటరావు, రవి మనోహరాచారితో కలిసి ఆవిష్కరించారు.

ఆపన్నహస్తం కోసం ఆశగా..

- దీనంగా ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబం
- మెదడువాపు వ్యాధి సోకి తల్లి మంచంపట్టడంతో తల్లడిల్లుతున్న పిల్లలు
- భార్యకు వైద్యం చేయించే స్తోమత లేక భర్త ఆవేదన



మెదడువాపుతో బాధపడుతున్న సుప్రజ

సూళ్లూరుపేట : అసలే నిరుపేద కుటుంబం.. వచ్చిందేమో ప్రాణాంతకమైన జబ్బు...వైద్యం చేయించుకునే స్తోమత లేదు.. ఇంటి దీపం రోజు రోజుకూ కొడిగడుతుంటే భర్త, ఇద్దరు ఆడపిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆపన్న హస్తం అందించేవారి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వివరాలు.. నాదెళ్లవారి కండ్రిగలో నెలవల రవి, సుప్రజ దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ముందు వెనుకా ఎవరూ లేరు. ఆస్తిపాస్తులు లేవు. సూళ్లూరుపేటలోని ఓ స్వీట్ షాపులో రవి రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. సుప్రజ కూడా గ్రామంలోనే కూలీ పనులకు వెళుతుండేది. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురైంది. స్థానిక ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రవి అప్పు చేసి నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో చూపించాడు. వైద్యులు పరీక్షించి సుప్రజకు మెదడు వాపు వ్యాధి వచ్చినట్లు నిర్ధారించారు. చికిత్సకు రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. అంత డబ్బులు లేక రవి దంపతులు ఇంటికి వచ్చేశారు. ఇరుగు పొరుగు వారు అందించిన సాయంతో ప్రస్తుతానికి ఆమె మందులు వాడుతోంది. మరణానికి చేరువ అవుతున్న సుప్రజను చూసి ఆమె భర్త, పిల్లలు కుమిలిపోతున్నారు. మానవత్వంతో స్పందించే దాతలు ఆర్థికసాయం అందించి తమ కుటుంబాన్ని నిలబెట్టాలని కోరుతున్నారు. 9391125345 నంబర్‌కు నగదు పంపించి ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి

చంద్రగిరి: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాలు..దొరవారిసత్రం మండలం మెల్లనత్తూరుకు చెందిన మణికంఠ(24) గత నెల 24న మండలంలోని ఎం.కొంగరవారిపల్లె బీసీ కాలనీకి తన భార్య నందినితో కలసి అత్తగారింటికి వచ్చాడు. అక్కడ దంపతులు గొడవ పడ్డారు. క్షణికావేశంతో మణికంఠ పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన తిరుపతి రుయా, అక్కడ నుంచి స్విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మణికంఠ మృతి చెందాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రాస్'లో చిరుధాన్యాలు, సేంద్రియ ఉత్పత్తుల మేళా

తిరుపతి కల్చరల్: స్థానిక అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రాస్ ప్రధాన కార్యాలయంలో ఈనెల 4,5,6వ తేదీల్లో చిరుధాన్యాల ఉత్పత్తులు, సేంద్రియ ఉత్పత్తుల మేళా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త టి.రాముకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

అలసత్వం.. అవినీతి పోలీసులపై వేటు

తిరుపతి క్రైమ్ : సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసును పెడదారి పట్టించిన ఎస్ఐ రవిబాబును క్రమశిక్షణ చర్యలో భాగంగా ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం సస్పెండ్ చేశారు. 2021 ఆగస్టు 28వ తేదీ నుంచి 2023 అక్టోబర్ 9వ తేదీ వరకు సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్లో రవిబాబు ఎస్ఐగా పని చేశారు. ఆ సమయంలో ఓ హత్య కేసును ఆయన దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో గాయపడిన వ్యక్తిని, ప్రత్యక్ష సాక్షిని విచారించడంలో ఎస్ఐ విఫలమయ్యారు. పై అధికారుల అనుమతి లేకుండా ఈ కేసుకు సంబంధించిన నిందితులను తొలగించారు. ఫిర్యాదుదారునికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కేసును తప్పుదోవ పట్టించారు. ఈ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులను తప్పించాడని, నేరం జరిగిన ప్రదేశంలో స్వాధీనం చేసుకున్న వస్తువులను కోర్టు ద్వారా ఆర్‌ఎఫ్ఎస్ఎల్‌కి పంపకుండా కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం చేశాడని తేలింది. దీన్ని తీవ్రంగా పరిగణిస్తూ సస్పెండ్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

భ్రష్టుపట్టిస్తున్న సిబ్బందిపై..

తిరుపతి క్రైమ్: అవినీతికి పాల్పడుతూ పోలీస్ శాఖను భ్రష్టు పట్టిస్తున్న ఒక కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. వివరాలు.. రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని గురవరాజుపల్లెలో చైనాకు చెందిన ఓ వ్యక్తికి వీసా గడువు పూర్తయింది. అయినా కూడా అక్రమంగా దేశంలో నివాసం ఉంటూ నకిలీ ఆధార్ కార్డు, పాన్ కార్డులు తయారుచేసుకున్నాడు. దీంతో చైనా జాతీయుడిపై 2021లో రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. గాజుల మండ్యం పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.బాలాజీ ఈ కేసు విషయంలో చైనా జాతీయుడికి సాయం చేస్తానని నమ్మించాడు. కేసుకు సంబంధించిన పోలీసు వివరాలను నిత్యం తెలియజేస్తూ, రూ.2 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వలేదు. వాట్సాప్ ద్వారా తెలుగులో అసభ్యకరంగా తిడుతూ వాయిస్ మెసేజ్‌లు పంపి హింసించినట్లు వచ్చిన ఫిర్యాదు రుజువు కావడంతో బాలాజీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న హోంగార్డు టి.గిరి స్టేషన్ పరిధిలో ఇసుక, కంకర, ఇతర వస్తువులను రవాణా చేస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని విచారణలో నిరూపణైంది. దీంతో ఆయనను సస్పెండ్ చేశారు. ఈ క్రమంలోనే అలిపిరి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ కె.రాజ్ కుమార్ ఇతరుల మొబైల్ ఫోన్ నుంచి తనపై అధికారులకు అనధికారికంగా ఫోన్ కాల్ చేసేవాడు. సహోద్యోగులపై లేనిపోని ఆరోపణలు చేశారని విచారణలో రుజువు కావడండంతో ఎస్పీ వెంటనే సస్పెన్షన్ వేటు వేశారు. వీరందరిపై సమగ్ర విచారణ చేపట్టి, శాఖాపరంగా కూడా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.